ఘనంగా లక్ష్మీనర్సింహస్వామి జాతర

ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న గ్రామస్తులు

రెబ్బెన, మార్చి 24 : మండలంలోని రాళ్ల పేట లక్ష్మీనర్సింహస్వామి జాతర ఆదివారం వైభవంగా జరిగింది. ప్రతి సంవత్సరం హోళి నాడు జాతరకు పరిసర గ్రామాల నుంచి పెద్ద ఎత్తున ప్రజలు తరలివచ్చి స్వామి వారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకోవటం అనావాయితీగా వస్తుందని గ్రామస్తులు పేర్కొంటున్నారు. ఆలయ అర్చకుడు ఉపేందర్ స్వామి ఆధ్వర్యంలో స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించి అన్నదానం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో వజ్జల శిరీశ్‌శర్మ, వారణాసి శ్రీనివాసరావు, నిమ్మకంటి సంతోష్ శర్మ, బోర్కర్ ప్రశాంత్‌కుమార్, సత్యనారాయణశర్మ, శంకర్‌రావు, మాజీ సర్పంచ్ జాదవ్ లలిత, గ్రామస్థులు అజ్మీర శంకర్‌నాయక్, బోర్కుటే తిరుపతి, ప్రేందాస్, అజ్మీర మురళీధర్, బాబురావు, రవీందర్, రమేశ్ లతో పాటు పలువురు ఉన్నారు.

ఖైదీలు నేరప్రవృత్తికి దూరంగా ఉండాలి

మాట్లాడుతున్న జిల్లా జడ్జి ఎంవీ రమేశ్

ఆసిఫాబాద్ అంబేద్కర్‌చౌక్, మార్చి 24 : ఖైదీలు నేరప్రవృత్తికి దూరంగా ఉండాలని యోగా చేస్తూ సత్‌ప్రవర్తనతో మెలగాలని, జైలు జీవితంలో మార్పు రావాలని జిల్లా జడ్జి ఎంవీ రమేశ్ సూచించారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని జిల్లా సబ్ జైలులో ఏర్పాటు చేసిన న్యాయ విజ్ఞాన సదస్సు, యోగాతరగతుల రెండవ రోజు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. జైలు జీవితం గడుపు తున్న ఖైదీలు సత్‌ప్రవర్తన కలిగి ఉండాలని అన్నారు. జైలు సుపరింటెండెంట్ ప్రేమ్‌కుమార్, బ్రహ్మకుమారి ఆర్తి ఉన్నారు.

టెట్ ఫీజును వెంటనే తగ్గించాలి

మాట్లాడుతున్న పీడీఎస్‌యూ నాయకులు

ఆసిఫాబాద్ అంబేద్కర్‌చౌక్, మార్చి 24 : రాష్ట్ర ప్రభుత్వం భారీగా పెంచిన టెట్ పరీక్ష ఫీజును వెంటనే తగ్గించాలని పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి జగజంపుల తిరుపతి డిమాండ్ చేశారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని జనకాపూర్‌లో పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గతంలో రెండు పేపర్లు కలిపి కేవలం నాలుగు వందల రూపాయల ఫీజు ఉండేదని ప్రస్తుత సర్కార్ అభ్యర్థుల ఆర్థిక పరిస్థితిని ఆలోచన చేయకుండా ఫీజులను వసూలు చేయడం సరి కాదని అన్నారు. దీనిపై పునరాలోచన చేసి ఫీజు తగ్గించాలని లేకుంటే ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. నాయకులు జాడి విలాస్, దుర్గం కోటేశ్వర్, శ్యామ్ ఉన్నారు.

ముగిసిన వేంకటేశ్వర స్వామి జాతర

రంగులరట్నం వద్ద జనసంద్రం

కెరమెరి, మార్చి 24: మండల కేంద్రంలోని నేహ్రూనగర్‌లో వేంకటేశ్వరస్వామి జాతర ఆదివారం ముగిసింది. వారసంతతో పాటు జాతర చివరి రోజు కావడంతో ప్రజలు భారి సంఖ్యలో తరలివచ్చారు. ఈ సందర్భంగా భక్తులు స్వామివారికి మొక్కులు చెల్లించారు. మారుమూల గ్రామాల ప్రజలతో పాటు చుట్టుపక్క మండలాల నుంచి సైతం జనం తరలిరావడంతో జాతర కిటకిటలాడింది.

అలంకరణ వస్తువుల కొనుగోళ్లు చేస్తున్న యువతులు

పోలింగ్ కేంద్రాల్లో సౌకర్యాలు కల్పించాలి

ఇంద్రవెల్లి, మార్చి 24: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాల్లో అన్ని సౌకర్యాలు కల్పించాలని ఉట్నూర్ సీఐ మొగిలి అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను ఆయన సందర్శించారు. పోలింగ్ కేంద్రంలో ఓటర్లతో పాటు పోలింగ్ నిర్వహణ అధికారులకు కల్పించే సౌకర్యాలు, తాగునీరు, విద్యుత్, ఓటర్లకు సరిపడ స్థలం, వివిధ అంశాలపై ఆరా తీశారు. మండలంలోని పోలింగ్ కేంద్రాల పూర్తి వివరాలు ఎస్ఐ సునీల్‌ను అడిగి తెలుసుకున్నారు. సమస్యాత్మకమైన పోలింగ్ కేంద్రాలను గుర్తించి పూర్తి వివరాలు జిల్లా అధికారులతో పాటు ఎన్నికల నిర్వహణ అధికారులకు దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు. ఆయన వెంట ఇంద్రవెల్లి ఎస్ఐ సునీల్, పోలీస్ సిబ్బంది, గ్రామ పంచాయతీ సిబ్బంది ఉన్నారు.

క్షయ నిర్మూలనకు కృషి చేయాలి

ప్రతిజ్ఞ చేస్తున్న డీఎంహెచ్‌వో తుకారాం, వైద్య సిబ్బంది

వాంకిడి : ర్యాలీ తీస్తున్న వైద్య సిబ్బంది

ఆసిఫాబాద్ అంబేద్కర్‌చౌక్, మార్చి 24: క్షయ నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని డీఎంహెచ్‌ఓ తుకారాం భట్ అన్నారు. ఆదివారం ప్రపంచ క్షయ వ్యాధి దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా కేంద్రంలోని డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్షయ వ్యాధి లక్షణాలు దాని వలన కలిగే అనర్థాలను ప్రతి ఒక్కరికి తెలియజేస్తూ గ్రామ స్థాయిలో అవగాహన కల్పించాలని అన్నారు. వ్యాధి నిర్ధారణ అయిన వారికి ప్రభుత్వం ప్రతి నెల పోషక ఆహారం కోసం 500 రూపాయలను, 6 నెలల పాటు ఉచితంగా మందులను అందజేస్తుందని తెలిపారు. అనంతరం వైద్య సిబ్బందితో కలిసి ప్రతిజ్ఞా చేశారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం అధికారి సునీల్ రావు, డాక్టర్ సిద్దార్థ్, వినోద్, పవన్ కుమార్, సిబ్బంది ప్రశాంత్ సంతోష్, తిరుపతి, ఆశా కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

వాంకిడి, మార్చి 24 : ప్రపంచ క్షయ వ్యాధి దినోత్సవం సందర్భంగా ప్రభుత్వ ఆసుపత్రి పరిధిలో వైద్య సిబ్బంది ఆదివారం ర్యాలీ నిర్వహించారు. డాక్టర్ మాట్లాడుతూ ముడు వారాలకు మించి దగ్గు, రాత్రి పూట జ్వ రం, బరువు తగ్గడం, లక్షణాలు ఉంటే మండల కేం ద్రంలోని (పీహెచ్‌సీ) ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చి తెమ డా పరీక్ష చేయించుకోవాలన్నారు. క్షయ వ్యాధి నిర్ధారణ అయితే మాత్రలు ఉచితంగా పంపిణీ చేసి వారికీ నెలకు రూ.500/ నిస్తాయ్ యోజన పథకం కింద ఇవ్వడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఆరోగ్యవిస్తరణ అధికారి రవిదాస్, ఏఎన్‌ఎం కృపావని, రుక్మిణి, సునంద, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా కామదహనం

పెంచికల్ పేట్ : ప్రత్యేక పూజలు చేస్తున్న మహిళలు

మనువడికి చక్కెర బిళ్లలు వేస్తున్న ఎమ్మెల్యే కోవ లక్ష్మి దంపతులు

ఆసిఫాబాద్ అంబేద్కర్‌చౌక్, మార్చి 24: హోలీ సందర్భంగా ఆదివారం మండలంలోని పలు గ్రామాల్లో కామదహనం నిర్వహించారు. ప్రత్యేకంగా తయారుచేసిన గార్ల పేరును పప్పు ప్రసాదంతో కాముడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం కాముడిని అంటించారు. పిల్లలకి చక్కర బిళ్ళల హారాలు వేశారు.

కెరమెరి, మార్చి 24: మండలంలో హోలీ పండుగను పురస్కరించుకోని కాముని పున్నం వేడుకలను ప్రజలు ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. ఆదివాసీలు తమ సంప్రదాయ పద్ధతుల్లో కార్యక్రమాని నిర్వహించారు. ముందుగా గ్రామంలోని పటేల్ ఇంట్లో కుటుంబానికి ఒక కుడక, చక్కెర బిల్లల హారాలు తీసుకొచ్చి సమావేశంలో హాజరయ్యారు. ఈ సందర్భంగా గ్రామంలోని పలు అంశాలపై చర్చించి, వార్షిక ప్రణాళికను రూపొందించారు. ఈ సందర్భంగా మాతరి, మాతర పేరట రెండు వెదురు కంకలను సిద్ధం చేసి ప్రజలు తీసుకొచ్చిన చక్కెర బిల్లల హారాలు, కుడకలతో పాటు పటేల్ ఇంట్లో తయారు చేసిన గారెలు, పచ్చి ఉల్లిపాయలు, వంకాయలు, మోదుగ పూలను కర్రలకు అలంకరించారు. అనంతరం ఊరి పొలిమెర వరకు డోలు వాయిద్యాలతో ఊరేగింపుగా తీసుకెళ్లి కామదహనం కార్యక్రమం నిర్వహించారు.

కామదహనం వద్ద పూజలు చేస్తున్న చిత్తగూడ ప్రజలు

అల్లిగూడలో కామదహనం చేస్తున్న గిరిజనులు

సిర్పూర్ (యు)ఫిబ్రవరి 24: హోలీ పండగను పురస్కరించుకుని ఆదివారం మండల కేంద్రములోని అల్లిగూడా, మహాగమ్, నెట్నూర్, పములవాడ, సిర్పూర్, పంగిడి, కోహినూర్, దాన్నోర, తదితర గ్రామాల్లో దహనం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజి మార్కెట్ కమిటీ చైర్మన్ ఆత్రం భగవంత్‌రావు, మాజీ సర్పంచ్ మెస్రం భూపతి, ఆత్రం జాలీంషా, పెందోర్ నాగోరావు, గ్రామస్థులు సెడ్మకి సంజీవ్, మెస్రం సుభాష్. కనక ఆనంద్‌రావు తదితరులు ఉన్నారు.

పెంచికల్ పేట్, మార్చి 24 : మండల కేంద్రంలోని కోదండ రామాలయం ప్రధాన రస్తాలో కామ దహనం నిర్వహించారు.

ముందస్తు హోలీ..

దహెగాం, మార్చి 24 : మండలం కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో ఆదివారం ముందస్తు హోలీ వేడులకు జరుపుకున్నారు. చిన్నపెద్ద తేడా లేకుండా కుల మతాలకు అతీతంగా వేడుకల్లో పాల్గొన్నారు.

దహెగాంలో హోలీ సంబురాల్లో యువకులు



ఝరిలో కామదహనం చేస్తున్న ప్రజలు

ప్రత్యేక పూజలు చేస్తున్న అరిగెల నాగేశ్వర్‌రావు

సల్ల మల్లన్న ఆలయంలో ప్రత్యేక పూజలు

ఆసిఫాబాద్, మార్చి 24 : మండలంలోని తుంపల్లి సల్ల మల్లన్న ఆలయంలో అధివారం బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర సహాయ కార్యదర్శి అరిగెల నాగేశ్వర్‌రావు ప్రత్యేక పూజలు చేశారు. ఆలయంలో గత వారం మల్లికార్జునస్వామి, నందీశ్వర, శివలింగం విగ్రహాలను ప్రతిష్టాపన చేశారు. అరిగెల స్వామి వారికి మొక్కులు చెల్లించారు. కార్యక్రమంలో నాయకులు గాజుల సత్యనారాయణ, ప్రసాద్ గౌడ్, వెంకన్న, గొల్ల, పెంటయ్య, లక్ష్మణ్, అశోక్, ఆలయ కమిటీ సభ్యులు ఉన్నారు.

అన్నదానం

మహంకాళి ఆలయంలో అన్నదానంలో పాల్గొన్న భక్తులు

రెబ్బెన, మార్చి 24 : మండలంలోని ఇందిరానగర్‌లో కొలువైన శ్రీ కనకదుర్గదేవి స్వయంభూ మహంకాళి ఆలయంలో ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. నైవేద్యాలు, ఒడిబియ్యం అమ్మవారికి సమర్పించి మొక్కులు చెల్లించుకోగా ఆలయ ప్రధాన అర్చకుడు దేవర వినోద్ భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించి అన్నదానం ఏర్పాటు చేశారు.

రైల్వే స్టేషన్ వద్ద మృతదేహం లభ్యం

ఎదులాపురం,మార్చి 24 : ఆదిలాబాద్ రైల్వే స్టేషన్ ముందు ప్లాట్‌ఫాంపై వ్యక్తి మృతదేహాన్ని పోలీసులు ఆదివారం తెల్లవారు జామున గుర్తించారు. మృతుడి వద్ద లభించిన ఆధార్‌కార్డు ద్వారా అతను బెజ్జూర్ మండలం కొత్తగూడెం గ్రామానికి చెందిన గొనే శంకర్ (56)గా గుర్తించారు. అతని బంధువులకు పోలీసులు సమాచారం అందించారు. మృతు డి తల పగిలి రక్తస్రావం కావడంతో అనుమానాస్పద మృతిగా భావిస్తున్నట్లు డీఎస్పీ జీవన్ రెడ్డి పేర్కొన్నారు. క్లూస్ టీం ద్వారా ఆధారాలు సేకరిస్తున్నట్లు పేర్కొన్నారు. టూటౌన్‌లోశంకర్ భార్య పార్వతిబాయి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ అశోక్ తెలిపారు. ఈ నెల 9వ తేదీన ఆదిలాబాద్‌కు మెస్త్రీ పని కోసం వెళ్తున్నానని భార్య ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నా రు. రైల్వే స్టేషన్ సమీపంలో ఉన్న సీసీ కెమెరాలు పరిశీలిస్తున్నామని మృతికి గల కార ణం తెలుసుకునే ప్రయత్నం చేస్తున్నామన్నారు.

జాతీయ స్థాయి క్రీడల్లో రాణించాలి

ఉట్నూర్, మార్చి 24 : న్యూఢిల్లీలో జరిగే జాతీయ సీనియర్ పురుషుల ఖోఖో పోటీల్లో రాణించి తెలంగాణ రాష్ట్ర సత్తా చాటాలని గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ ఎం దిలీప్ కుమార్ అన్నారు. ఆదివారం ఉట్నూర్ కేబీ కాంప్లెక్స్ మైదానంలో నిర్వహించిన రాష్ట్ర జట్టు ముగింపు కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీనియర్ నేషనల్స్‌లో పాల్గొనే క్రీడాకారులతో ఆడడం వల్ల గిరిజన ఆదర్శ క్రీడా పాఠశాల విద్యార్థులు ఖోఖోలో మరింత ప్రతిభావంతులుగా ఎదిగేందుకు అవకాశం ఏర్పడిందన్నారు. వచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అల్టిమేట్ ప్రీమియర్ లిగ్ పోటీల నిర్వహణ అనంతరం ఖోఖో క్రీడకు క్రీడాకారులకు మంచి ఆదరణ లభిస్తోందన్నారు. క్రీడాకారులు జాతీయ, అంతర్జాతీయ క్రీడల్లో పతాకాలు సాధించాలని ఆకాంక్షించారు. క్రీడాకారులను శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా గిరిజన క్రీడల అధికారి పార్థసారిథి, ఏటీడీవో క్రాంతికుమార్, జాదవ్ హేమంత్ పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

నార్నూర్, మార్చి 24 : యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని ఉట్నూర్ డీఎస్పీ సీహెచ్ నాగేందర్ అన్నారు. కమ్యూనిటీ పోలీసింగ్ కార్యక్రమంలో భాగంగా చోర్‌గావ్ గ్రామంలో నార్నూర్ సర్కిల్ ఇన్స్పెక్టర్ రహీంపాషా, సబ్ ఇన్స్పెక్టర్ రవికిరణ్‌తో కలిసి ఆదివారం గ్రామస్తులతో కలిసి సమావేశం ఏర్పాటు చేశారు. ముందుగా అవగాహన ర్యాలీ తీశారు. సైబర్‌క్రైం, గంజాయి వినియోగం, మహిళలపై జరిగే నేరాలు, డయల్ 100తో పాటు పలు అంశాల గురించి వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత మత్తు పదార్థాలకు బానిసై భవిష్యత్‌ను నాశనం చేసుకోవద్దన్నారు. క్రమశిక్షణతో మెలుగుతూ ఉన్నత లక్ష్యాలను అందుకోవాలని ఆకాంక్షించారు. అలాగే గ్రామస్తులు కూడా గంజాయి, నాటుసారా తయారు చేసి విక్రయించవద్దన్నారు. చట్ట వ్యతిరేక పనులకు ఎవరైన పాల్పడిన చట్ట ప్రకారం శిక్షింపబడుతారని తెలిపారు. రాబోవు ఎన్నికలు దృష్టిలో పెట్టుకొని శాంతిభద్రతల పరిరక్షణకు ప్రజలు సహకరించాలని కోరారు. చోర్‌గావ్‌ను మద్యపాన, గంజాయి రహిత గ్రామంగా తీర్చిదిద్దేందుకు సహకరించాలని తీర్మానం చేశారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, యువకులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరిస్తాం

పేపర్ మిల్లు జీఎం ఎంఎస్ గిరి

మాట్లాడుతున్న పేపర్ మిల్లు జీఎం ఎంఎస్ గిరి

కాగజ్‌నగర్, మార్చి 24: ఆమోదయోగ్యంగా ఉన్నా సమస్యలు పరిష్కరించబడ్డాయని పేపర్ మిల్లు జీఎం ఎంఎస్ గిరి స్పష్టం చేశారు. కాగజ్‌నగర్ పట్టణంలోని ఎస్పీఎం క్లబ్‌లో ఆదివారం సాయంత్రం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత కొద్ది రోజులుగా లారీ అసోసియేషన్ పేపర్ మిల్లు మధ్య లారీల కిరాయి, క్యాంటీన్ వసతి, తదితర సమస్యలు పరిష్కరించాలని సమ్మె, దీక్షలు జరుగుతున్నా తరుణంలో మిల్లు ప్రతినిధులు విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. కలెక్టర్, డివిజన్ అధికారుల సమక్షంలో చర్చలు జరిగాయని రిజానేబుల్, జన్యున్‌గా ఉన్నా సమస్యలు పరిష్కంచామన్నారు. మిగతా రెండు, మూడు సమస్యల పై కమిటీ వేసి పరిష్కరించుకోవడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. పేపర్ మిల్లుపై ఎందరో ఆధారపడి ఉన్నారని, మిల్లు అభివృద్ధికి కృషి చేయాల్సిన బాధ్యత ఉందన్నారు. డిమాండ్ల పరిష్కారంలో మిల్లుకు నష్టం వాటిల్లకుండా చూడాల్సిన బాధ్యత కూడా ఉందన్నారు. కార్యక్రమంలో సీనియర్ మేనేజర్ రమేశ్ రావు ఉన్నారు.

కొనసాగుతున్న నిరాహారదీక్ష

కాగజ్‌నగర్, మార్చి 24: కాగజ్‌నగర్ పట్టణంలోని పెంట్రోల్ పంపు ఏరియాలోని లారీ అసోసియేషన్ భవనం ఎదుట గత రెండు రోజులుగా నిరహార దీక్ష కొనసాగుతుంది. లారీ అసోసియేషన్ ఆధ్వర్యంలో చేపట్టిన దీక్షకు కాంగ్రెస్ పార్టి జిల్లా అధ్యక్షుడు కొక్కిరాల విశ్వప్రసాద్, కాంగ్రెస్ పార్టి నియోజకవర్గం ఇన్‌చార్జి రావి శ్రీనివాస్ ఆదివారం మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా లారీ వేల్ఫేర్ అసోసియేన్ అధ్యక్షుడు వెన్న కిషోర్ బాబు మాట్లాడుతూ గత కొద్ది రోజులుగా న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని సమ్మె చేసినప్పటికి పేపర్ మిల్లు యాజమాన్యం స్పందించక పోవడంతో నిరహార దీక్షకు దిగామన్నారు. ఇప్పటికైన లారీ అసోసియేషన్ సమస్యలు పరిష్కరించాలని, లేని యేడల దీక్ష తీవ్రతరం చేస్తామని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు మాట్లాడుతూ పేపర్ మిల్లు యాజమాన్యం మొండి వైఖరి వీడి లారీ అసోసియేషన్ సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఈ విషయమై ఇన్‌చార్జి మంత్రి సీతక్క దృష్టికి తీసుకెళ్లడంతో మంత్రి జిల్లా కలెక్టర్‌తో మాట్లాడడం జరిగిందన్నారు. కార్యక్రమంలో లారీ అసోసియేషన్ ప్రతినిధులు ఖయ్యూం, మోయినోద్దిన్, రాజేందర్, ఆహ్మద్ పాషా పాల్గొన్నారు.

కర్ర లారీతో పొంచి ఉన్న ప్రమాదం

కర్ర లారీ తగలడంతో నేలకొరిగిన సెంట్రల్ లైటింగ్ స్తంభం

కాగజ్‌నగర్, మార్చి 24: కాగజ్‌నగర్ పట్టణంలోని పేపర్ మిల్లుకు ముడి సరుకు తీసుకొచ్చే లారీలతో పట్టణ ప్రజలకు ముప్పు పొంచి ఉంది. ఈ నెల 23న రోడ్డు విస్తరణకు మోక్షమెప్పుడో అనే కథనం నమస్తే తెలంగాణలో ప్రచురితమైన విషయం తెలిసిందే. పేపర్ మిల్లుకు ముడి సరుకు తీసుకోచ్చే లారీలతో సెంట్రల్ లైటింగ్‌కు ముప్పు ఉందని, కర్ర భారీ వాహనాలు సెంట్రల్ లైటింగ్ పోల్స్‌కు తగలడంతో ధ్వంసమవుతున్నాయని, సర్‌సిల్క్ మీదుగా దారి మళ్లించాలని ప్రచురించడం జరిగింది. ఇది నిజం చేస్తూ ఆదివారం సాయంత్రం మిల్లుకు కర్ర తీసుకొచ్చిన కర్ర లారీ సెంట్రల్ లైటింగ్ పోల్‌కు బలంగా తగలడంతో ఇనుప పోల్ బాటంలో విరిగి పూర్తిగా ఒరిగిపోయింది. డివైడర్ వైపు ఒరగడంతో పెద్దముప్పు తప్పిందని ఆ ప్రాంతం వ్యాపారులు ఊపిరి పీల్చుకుంటున్నారు. మున్సిపల్ సిబ్బంది వెంటనే విద్యుత్ సరఫరా నిలిపేసి తగు చర్యలు తీసుకున్నారు. సెంట్రల్ లైటింగ్ పోల్ ధ్వంసం చేసిన లారీని పోలీసు స్టేషన్‌కు తరలించారు. ఇప్పటికైన మున్సిపల్ అధికారులు స్పందించి మిల్లుకు ముడి సరుకు తీసుకొచ్చే లారీలను సర్‌సిల్క్ మీదుగా దారి మళ్లించాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.